# రాస్–కృషి విజ్ఞాన కేంద్రం

## జాతీయ వ్యవసాయ పరిశోధనా మండలి, న్యూఢిల్లీ

## పట్టు గూళ్ళతో హస్త కళాకృతులు స్వయం ఉపాధికి సోపానాలు



## పట్టుగూళ్ళ హస్తకళాకృతులు–స్వయం ఉపాధికి సోపానాలు













పట్టు ఉత్పత్తిలో చైనా తర్వాత భారత దేశం రెండో స్థానంలో ఉండగా, మన దేశంలో కర్ణాటక తర్వాత ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో చిత్తూరు జిల్లా పట్టుగూళ్ళ ఉత్పత్తిలో మొదటి స్థానంలో ఉంది. టిప్పుసుల్తాన్ కాలం నుంచి పట్టు పరిశ్రమ, రైతన్నకు వెనుదన్నుగా ఉంటూ మంచి ఆదాయాన్ని అందిస్తూవుంది. ఈ పరిశ్రమను స్థూలంగా మల్బరీ తోటల పెంపకం, పట్టుగూళ్ళ ఉత్పత్తి, పట్టుపురుగుల పెంపకం, దారం తీయడం, వస్త్రాలను నేయడం లాంటి విభాగాలుగా విభజించారు. ప్రతి విభాగంలోనూ ముఖ్య ఉత్పత్తులతో పాటు ఉప ఉత్పత్తులు కూడా పొందడం విశేషం. మల్బరీ తోటల పెంపకంలో మిగిలిన ఆకులను, రెమ్మలను పశు గ్రాసంగాను, మల్బరీ ఆకులతో టీ పొడి (హెర్బల్ టీ) ని తయారు చేయడంలోను, కంపోస్టు ఎరువుల తయారీలోనూ, సౌందర్య సాధనాలలోనూ, ఆహార ఉత్పత్తులలోనూ, స్నాక్స్ తయారీలో, మొదలగు వాటిలో వినియోగిస్తున్నారు. పట్టు పురుగుల పెంపకంలో లభించే పెంటికలను, బయోగ్యాసు ఉత్పత్తిలోను, కంపోస్టు తయారీలోనూ విరివిగా వాడుతున్నారు. పట్టు దారం తీసే విభాగం నందు లభించే జంట గూళ్ళు (డబుల్ కకూన్స్) మొదలగు పట్టు వ్యర్థాలను స్పన్ సిల్క్, డూప్ యార్న్ పరిశ్రమ లందు ధారాళంగా వినియోగిస్తున్నారు. ప్యూపాల నుంచి లభించే నూనెను, సబ్బులు మరియు ఔషధ తయారీ పరిశ్రమల్లో వాడుతున్నారు.

పట్టుగూళ్ళు ఉత్పత్తి కేంద్రాల్లో ఉపయోగించు విత్తన గూళ్ళ నుంచి ప్యూపాలను వేరు చేయుటకు పట్టుగూళ్ళను ఒకవైపు కత్తిరిస్తారు. వీటిని కట్ కకూన్స్ అంటారు. అలాగే పియర్స్డ్ కకూన్స్ నుంచి పట్టుదారం తీయడం సాధ్యం కాదు. కనుక వీటిని స్పన్ సిల్క్, పరిశ్రమలకు విక్రయిస్తారు.

కట్ కకూన్స్ మరియు పియర్స్డ్ కకూన్స్‌లను ఉపయోగించి అందమైన పుష్పాలు, పూలమాలలు, బొకెలను (పుష్పగుచ్ఛాలు), గ్రీటింగ్ కార్డులు, తోరణాలును, చెవికమ్మలు, బొమ్మలు మొదలైనవి తయారు చేయవచ్చు. ఓపిక, సృజనాత్మకత పెంచుకున్న కొద్ది అందమైన కళాకృతులను రూపొందించుకోవచ్చు.

### కావాల్సిన వస్తువులు

రీలింగుకు పనికిరాని కకూన్స్, రంగుపొడులు, కత్తెర, సూది, రంగు కాగితాలు, క్రాఫ్ట్ పేపరు, ఫెవికాల్, టేప్, దారం, గ్లూగన్, జిగ్ జాగ్ కత్తెర, పూసలు, బైడింగ్ వైరు, ఆకుపచ్చ టేపు, వివిధ రకాల వాజులు, స్పాంజు మొదలుగునవి.

### శుభ్రపరచుట

పట్టుగూళ్ళను సేకరించిన తర్వాత వాటిపైనున్న పీచు పొరను, కకూన్స్ లోపల ఉన్న ప్యూపా అవశేషాలను తొలగించి శుభ్రపరచుకోవాలి.

### కత్తిరించుట.

శుభ్రపరచిన తర్వాత పట్టుగూళ్ళను కావలసిన ఆకృతిలో కత్తిరించుకోవాలి. పూల మాలకైతే జిగ్ జాగ్ కత్తెరతో గూడును కత్తిరించుకోవచ్చు లేదా మామూలు కత్తెరను ఉపయోగించి కూడా అందమైన ఆకృతిలో కత్తిరించుకోవచ్చు. పుష్పాలకైతే ప్రకృతిలో లభించు పుష్పాల మాదిరిగా వివిధ ఆకృతుల్లో కత్తిరించి ఫెవికాల్ లేదా గ్లూగన్ సహాయంతో అతికించుకోవాలి.

### రంగుల అద్దకం

పట్టు అద్దకానికి ఉపయోగించే రంగు పొడులను కొనుగోలు చేసి, కత్తిరించిన పట్టుగూళ్ళకు రంగులు అద్దుకోవాలి. రంగుల అద్దకం కొరకు మంచినీటిని వేడిచేసి తగినంత రంగుపొడి వేసి, కొంచెం వేడినీటిలో ఉండలు లేకుండా కలుపుకోవాలి.








ఈ ద్రావకాన్ని, వేడినీరును మరొక వెడల్పాటి పాత్రలో పోసి ఉష్ణోగ్రత సుమారు 40 నుంచి 50 డిగ్రీ సెం.గ్రే. ఉండేలా చూసి, అందులో పట్టుగూళ్ళను వేసి రంగులు అద్దుకోవాలి. బాగా రంగు అంటేవరకు 7 నుంచి 10 నిమిషాల పాటు కలియబెట్టాలి. తర్వాత రంగు అంటిన పట్టుగూళ్ళను వేరుచేసి, నీడపాటున శుభ్రమైన ప్రదేశంలో ఆరబెట్టుకోవాలి.

### దండలు తయారు చేసుకోవటం

బైవోల్టిన్, సి.బి. పట్టుగూళ్ళ నుంచి దండలు తయారుచేసుకోవచ్చు. పట్టుగూళ్ళను ఒకవైపు జిగ్‌జాగ్ కత్తెరతోగాని లేదా కావాల్సిన ఆకారంలో కత్తిరించిన తర్వాత నాలుగు లేదా ఐదు గూళ్ళను వాటి రెండో కొన చివరలను కలుపుతూ కుచ్చులుగా కుట్టి ముడి వేసుకోవాలి. ఈ కుచ్చులను మధ్య నుంచి గట్టి దారం ఉపయోగించి కావలసినంత పొడవు దండ తయారు చేసుకోవచ్చు మధ్య మధ్యన వేరు వేరు రంగుల కుచ్చులను, పూసలను ఉపయోగించి ఆకర్షణీయమైన దండలను తయారుచేయవచ్చు.

### పూలు, పుష్పగుచ్ఛాలు తయారీ

తెల్లని గూళ్ళను (బైవోల్టిన్) తీసుకొని కావల్సిన పూలరేకుల ఆకృతిలో కత్తిరించి, ఈ రేకులను ఒకదాని పై ఒకటి వ్యతిరేక దిశల్లో ఉంచుకుంటూ ఫెవికాల్ లేదా గ్లూగన్ సహాయంతో అతికించుకోవాలి. బాగా ఆరిన తర్వాత వీటిని సన్నని బైండింగ్ వైర్ సహాయంతో ముడివేసి, కాడ భాగానికి ఆకుపచ్చ టేపును చుట్టుకోవాలి.

### గ్రీటింగ్ కార్డులను తయారుచేయడం

వివిధ ఆకృతుల్లో కత్తిరించుకున్న పట్టుగూళ్ళను క్రాఫ్ట్ పేపరు లేదా వెల్వెట్ పేపర్‌పైన కావల్సిన డిజైన్లలో అతికించి అందమైన గ్రీటింగ్ కార్డులను తయారు చేయవచ్చు.








▶ **బొమ్మలను తయారు చేయడం**

విభిన్న ఆకృతుల్లో ఉన్న పట్టుగూళ్ళను ఎంచుకొని రకరకాల పక్షులు, జంతువులు, పూలు ఆకృతుల్లో చిన్న చిన్న బొమ్మలను ఆకర్షణీయంగా తయారు చేసుకోవచ్చు.



▶ **చెవికమ్మలను, గాజులను తయారు చేయడం**

వివిధ ఆకృతుల్లో పట్టుగూళ్ళను కత్తిరించి, వాటికి పూసలను గ్లూగన్ ఉపయోగించి అంటించి చెవికమ్మలను తయారు చేయవచ్చు. అదేమాదిరిగా చెవికమ్మల అచ్చులు మార్కెటులో లభ్యమవుతుంటాయి, వాటిని కొనుక్కొని రంగుల పట్టుదారం చుట్టి రకరకాల పూసలు అంటించి చెవి బుట్టలను కూడా తయారు చేసుకోవచ్చు. ప్రస్తుతము అలంకరణ వస్తువులకు బాగా డిమాండ్ ఉండడం వలన, పట్టుదారంతో చేసిన గాజులు, కమ్మలకు మంచి మార్కెట్ ధర లభ్యవుతుంది.





▶ **ఆదాయ వ్యయాలు**

హిందుపురం, పెనుకొండ, ధర్మవరం, కదిరి, మదనపల్లి, పలమనేరు, చిత్తూరు పట్టుగూళ్ళ ఉత్పాదన కేంద్రాల్లో లభించే పియర్సుడ్ కట్ పట్టుగూళ్ళ కిలో ధర సుమారు రూ. 800-1000/- వరకు ఉంటుంది. కిలోకి దాదాపు రూ.2300/- గూళ్ళు (బైవోల్టిన్) తూగుతాయి. సాధారణంగా దండ సైజు (పరిశ్రమ)ను బట్టి కిలో గూళ్ళను ఉపయోగించి 50 అందమైన దండలను తయారుచేయవచ్చు. మార్కెటులో ఒక్కో దండ రూ.200-300/- వరకు ధర పలుకుతుంది. అలాగే కిలో గూళ్ళను ఉపయోగించి దాదాపు 20-30 పుష్పగుచ్ఛాలను తయారు చేయవచ్చు. ఒక్కో పుష్పగుచ్ఛాన్ని కనీసం రూ.150-250/- వరకు అమ్మవచ్చు. ప్రకృతిలో సహజసిద్ధంగా లభించే పూలతో తయారు చేసిన దండలు, పుష్పగుచ్ఛాలు త్వరగా వాడిపోయి అందవిహీనంగా తయారువుతాయి.







అయితే పట్టుగూళ్ళ నుంచి తయారు చేసినవి కనీసం 5-10 సంవత్సరాల పాటు పాడవకుండా ఉంటాయి. అంతేకాకుండా ఈ విధంగా తయారు చేసిన పూలదండలు, పుష్పగుచ్ఛాలు, చెవికమ్మలకు మార్కెటులో మంచి గిరాకీ ఉంది. చెవికమ్మలు, గాజులు వేసుకొన్న దుస్తులకు అనుగుణంగా రకరకాలైన రంగులలో లభ్యమవడం వల్ల, బంగారంతో తయారు చేసిన వాటికంటే ఇటువంటి ఫ్యాన్సీ కమ్మలు, గాజులు వైపు ఆడవారు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. చాలా మంది వీటిని తయారు చేసి స్వయం ఉపాధి పొందుతున్నారు.

**విజయ గాథ**



తిరుపతి రూరల్‌కి చెందిన ఆర్. సుజాత ఇంటి వద్ద కాళీ సమయంలో పట్టుగూళ్ళు, పట్టుదారముతో చేసిన అలంకరణ వస్తువులను తయారు చేస్తు 4గురు మహిళలకు పనిని కలిపిస్తూ, వాటి అమ్మకము ద్వారా నెలకు ఆదాయం రూ. 12000- 15000/- పొందుతుంది.




ఇంటి వద్దనే ఉండి హస్తకళల ద్వారా ఆదాయం పొందాలనుకొనే వారికి కృషి విజ్ఞాన కేంద్రము నందు శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తాము. ఆసక్తి కలిగినవారు శిక్షణా కార్యక్రమాల వివరాలకు సంప్రదించవలసిన చిరునామా.

సీనియర్ శాస్త్రవేత్త మరియు హెడ్
డా. యస్. శ్రీనివాసులు
ఫోన్.8985322006

శిక్షణ నిర్వాహకురాలు, శాస్త్రవేత్త
ఎ. పద్మజ
ఫోన్.9494830289

డిజైన్: వి. దేవి, కంప్యూటర్ ప్రోగ్రామర్
ముద్రణ: సాయిశ్రీ ఆఫ్‌సెట్ ప్రింటర్స్, తిరుపతి

## రాస్-కృషి విజ్ఞాన కేంద్రం

వనస్థలి, కరకంబాడి పోస్ట్, రేణిగుంట మండలం - 517520
చిత్తూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్. ఫోన్ : 0877- 2240203
email: rasskvk@gmail.com, web:kvkchittoor.org